RNI. No. TELTEL /2022/ 89348

మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..



# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 4 సంచిక : 134 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | గురువారం, మే,14, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## దుబారా ఖర్చులను తగ్గిద్దాం..: చంద్రబాబు



అమరావతి,మే 13 పశ్చిమాసియా యుద్ధ పరిస్థితుల వల్ల దేశంపై పలు విధాలుగా భారం పడుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించిన పొదుపు సూచనలపై సీఎం స్పందించారు. నిడమర్రులో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. కిమ్స్ ఆస్పత్రికి భూమి పూజ చేశారు.

బైసర్ స్కిల్ వర్సిటీ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అమలాపురం ఎంపీ హరీశ్ బాలయోగి, మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని ప్రకటించిన 8 పొదుపు సూచనలు పాటించాలని ప్రజలకు సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. మరో రెండు రోజుల్లో ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ పరంగా కూడా ఓ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. ఇలాంటి క్లిష్ట సమయాల్లో ప్రభుత్వాలతో పాటు... ప్రజలు కూడా బాధ్యతగా ఉండాలని సూచించారు.

## హైదరాబాద్‌లో ఉబెర్ విస్తరణ..

### సీఎం రేవంత్ రెడ్డితో సీఈవో భేటీ



**హైదరాబాద్,మే 13:** ప్రధాన నగరాల్లో పెరుగుతున్న పార్కింగ్ సమస్యపై దృష్టి పెట్టాలని అవకాశం ఉంటే మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలనిముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ సంస్థకు సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉబెర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీఅయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలంగాణలో ఉబెర్ సంస్థ వ్యాపార కార్యకలాపాలను దారా ఖోస్రోషాహి వివరించారు. హైదరాబాద్‌లో ఉబెర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని, ఇక్కడ 600 మంది ఇంజినీర్లు పనిచేస్తున్నట్లు వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు.

భవిష్యత్తులో మరింత విస్తరణకు ఆసక్తి చూపుతున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ సహకారం ఉండాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. దేశంలోని ప్రధాన నగరాల్లో పార్కింగ్ ప్రధాన సమస్యగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. మల్టీలెవల్ పార్కింగ్ కేంద్రాల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఉబెర్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. మెట్రో స్టేషన్ల దగ్గర తగిన పార్కింగ్ సౌకర్యం లేదని ఆయన తెలిపారు. దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈవీ ఛార్జింగ్ సెంటర్లతో పాటు పార్కింగ్ సెంటర్ల ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి సూచనపై తప్పకుండా అధ్యయనం చేస్తామని ఉబెర్ ప్రతినిధి బృందం తెలిపింది. హైదరాబాద్‌కు సమీపంలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉబెర్ ప్రతినిధులకు వివరించారు. 30 వేల ఎకరాల్లో నిర్మించే ఈ సిటీ ప్రపంచంలోనే ప్రత్యేకమైనదన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన 500 కంపెనీలను ఫ్యూచర్ సిటీకి ఆహ్వానిస్తున్నామని, ఇప్పటికే పలు సంస్థలు తమ కార్యకలాపాల కోసం ముందుకు వచ్చాయని సీఎం తెలిపారు.

శంషాబాద్ విమానాశ్రయానికి 25 కిలోమీటర్ల దూరంలోనే ఫ్యూచర్ సిటీ ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. గత డిసెంబర్‌లో ఇక్కడ నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌లో 100కు పైగా కంపెనీలు పాల్గొని పెట్టుబడులకు ముందుకు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీలో ఉబెర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి సీఈఓ దారా ఖోస్రోషాహి ఆసక్తి చూపించారు. ఈ సమావేశంలో ఉబెర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (జదీూ) మధు కన్నన్, ఉబెర్ ఇండియా ఊ సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు.

## కేరళ కాంగ్రెస్‌లో ముసలం..

### కేసీ వేణుగోపాల్‌కు సీఎం పదవి.. వ్యతిరేకిస్తున్న వీడీ సతీషన్..?



కేరళ : ఇటీవల జరిగిన ఐదు అసెంబ్లీలకు సంబంధించి నాలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు కొలువుదీరాయి. నాలుగు రాష్ట్రాల్లో సీఎంలు ప్రమాణ స్వీకారం చేశారు. కానీ, కేరళలో మాత్రం ఇంకా సీఎం ఎంపిక పూర్తి కాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. దీనంతటికీ కారణం.. కేరళ కాంగ్రెస్ పార్టీలోని వర్గ విబేధాలే. సీఎం అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఎటూ తేల్చడం లేదు. సీఎం ఎంపిక విషయంలో కేరళ కాంగ్రెస్ పార్టీలో ముసలం ఏర్పడినట్లు కనిపిస్తోంది. కేరళలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూడీఎఫ్ కూటమికి అధికారం దక్కింది. ఇంతకుముందు అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ కూటమి ఓడిపోయింది. దీంతో యూడీఎఫ్ అధికారం చేపట్టాలి. ఈ కూటమిలో అత్యధిక సీట్లతో కాంగ్రెస్ పార్టీకి సీఎం పదవి దక్కాలి. కానీ, పార్టీ అగ్రనేతల మధ్య సీఎం సీటు విషయంలో బేధాభిప్రాయాలున్నాయి. సీఎం పదవి కోసం కాంగ్రెస్ నుంచి కేసీ వేణుగోపాల్, వీడీ సతీషన్, రమేష్ చెన్నితల పోటీ పడుతున్నారు. వీరిలో కేసీ వేణుగోపాల్ పేరే ప్రముఖంగా వినిపిస్తోంది. ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతుతోపాటు, అధిష్టా నం మద్దతు కూడా ఆయనకే ఉంది. అయితే, ఆయనను సీఎం చేయడాన్ని సతీష్ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. వేణుగోపాల్‌ను సీఎంగా ఎన్నుకుంటే ఆయన తన ఎంపీ స్థానానికి రాజీనామా చేయాలి. అలాగే, మరో చోట ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్ని కవ్వాలి. అంటే, తను రా జీనామా చేసిన స్థానంతోపాటు కొత్తగా పదవి కోసం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది.

దీంతో రెండు చోట్ల ఎన్నిక జరగాలి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది పార్టీకి అంత మంచిది కాదని సతీషన్ వర్గం అంటోంది. ఒకవేళ వేణుగోపాల్‌ను సీఎం చేస్తే.. తాను ఆ మంత్రివ ర్గంలో చేరబోనని కూడా సతీషన్ తెలిపారు. దీంతో ఈ ఇద్దరి వర్గాలు పార్టీలో విబేధాలు తీసుకొచ్చాయి. అలాగే, రమేష్ చెన్నితల వర్గం కూడా సీఎం పదవి కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. దీంతో ఎవరికి పదవి ఇవ్వాలో తెలియక కాంగ్రెస్ సతమతమవుతోంది.

## నీట్ పేపర్ లీక్ కేసు..

### మహిళను అదుపులోకి తీసుకున్న సీబీఐ..



పుణె : నీట్ యూజీ-2026 పేపర్ లీక్ కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) అధికారులు దూకుడు పెంచారు. పేపర్ లీక్ ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసిన సీబీఐ అధికారులు వరుసగా పలువురిని అదుపులోకి తీసుకుంటున్నారు. ఈరోజు (బుధవారం) ఉదయం రాజస్థాన్‌కు చెందిన మంగీలాల్, దినేశ్‌ను అదుపులోకి తీసుకోగా.. తాజాగా పుణెకు చెందిన ఓ మహిళను విచారణ నిమిత్తం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ కేసుతో సదరు మహిళకు సంబంధం ఉందని అనుమానించిన పుణె పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని సీబీఐకి అప్పగించారు.

నిందితురాలిని బిబ్వేవాడి ప్రాంతంలో అరెస్టు చేసినట్లు పుణె పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ తెలిపారు. తాము విచారించిన అనంతరం సీబీఐ అధికారులకు అప్పగించామని చెప్పారు. అయితే, ఈ కేసులో ఆమె కచ్చితమైన పాత్రను వివరించేందుకు కమిషనర్ నిరాకరించారు. కాగా, అండర్‌గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 3వ తేదీన పరీక్ష నిర్వహించారు. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 నగరాల్లో విద్యార్థులు నీట్ పరీక్ష రాశారు. ఈ పరీక్ష రాసేందుకు 23 లక్షల మంది నమోదు చేసుకోగా, 96.92 శాతం మంది హాజరయ్యారు. పరీక్ష రద్దు కావడంతో 23 లక్షల మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పేపర్ లీక్ ఘటనపై పలు విద్యార్థి సంఘాలు మండిపడుతూ ఆందోళనకు దిగుతున్నాయి. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

## పొదుపు సూత్రాలు తెలంగాణకు డబ్బులు మాత్రం ఏపీకి

### ప్రధాని మోదీపై కవిత సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 13: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయహోదా కోసం కేంద్ర ప్రభు త్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్టును 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు.

## ఇంధన పొదుపులో భాగంగా...
## భారీగా తగ్గిన మోదీ కాన్వాయ్



ఢిల్లీ: భారత ప్రధాని నరేంద్ర మోదీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పొదుపు చర్యల్లో భాగంగా తన కాన్వాయిలోని కార్ల సంఖ్యను భారీగా తగ్గించనున్నట్లు ప్రకటించారు. ఇక నుంచి కేవలం రెండు వాహనాల్లోనే తన కాన్వాయి ఉండనున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొన్న వేళ పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదే విధంగా పలువురు కేంద్రమంత్రుల కాన్వాయిలోని వాహనాల సంఖ్య సైతం భారీగా తగ్గింది. హోంశాఖ మంత్రి అమిత్ షా కాన్వాయి మూడు వాహనాలకు తగ్గగా రక్షణ శాఖ మంత్రి కాన్వాయి 11 వాహనాల నుంచి నాలుగు వాహనాలకు తగ్గించారు.

కాగా ఇటీవల దేశ ప్రజలకు పొదుపు చర్యలు చేపట్టాలని ప్రధాని పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ప్రధాని సైతం స్వయంగా ఆ నిబంధనలను పాటిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఇటీవల హైదరాబాద్‌లోని బహిరంగ సభలో మాట్లాడుతూ ప్రధాని దేశానికి కీలక సూచనలు చేశారు.

"పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు తీవ్రంగా పెరిగాయి. ప్రస్తుత కష్ట సమయాల్లో ప్రజలంతా సంయమనం పాటిం చాలి. విదేశీ ప్రయాణాలు, దుబారా ఖర్చులు పూర్తిగా తగ్గించుకోవాలి.

## బండి భగీరథ్ అరెస్ట్‌ను ఆపడం ఎవరి వల్లా కాదు: టీపీసీసీ చీఫ్



**హైదరాబాద్,మే 13:** బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసు వ్యవహారంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం జరగడం లేదని స్పష్టం చేశారు. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతూనే ఉందని చెప్పారు. తప్పకుండా భగీరథ్‌ను అరెస్ట్ చేస్తారని.. ఇందులో అనుమానమే లేదని అన్నారు. అరెస్ట్ అవ్వకుండా ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పారు. భగీరథ్‌ను తప్పించే అవసరం మాకు లేదని వెల్లడించారు. ప్రస్తుతం భగీరథ్ పరారీలో ఉన్నాడని తెలిసింది.

## మహారాష్ట్రలో కుప్పకూలిన ట్రైనీ విమానం



పుణే: మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఒక శిక్షణ విమానం కుప్పకూలింది. రెడ్ బర్డ్ ఏవియేషన్' సంస్థకు చెందిన టూ-సీటర్ శిక్షణ విమానం సాంకేతిలోపం కారణంగా కూలిపోయింది. నెలల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన విమాన ప్రమాదంలో, అప్పటి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మరణించిన ఘటన జరిగిన తర్వాత ఈ సంఘటన చోటుచేసుకోవడం గమనార్హం. పుణే రూరల్ పోలీస్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపిన వివరాల ప్రకారం, ఈ విమానంలో కేవలం ఒకే ఒక ట్రైనీ పైలట్ ఉన్నారు. విమానం తక్కువ ఎత్తులో ఎగురుతున్నప్పుడు సాంకేతిక లోపం తలెత్తిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

# సంపాదకీయం

## ఒకే ఒక్క శాతం మంది దగ్గర 40 శాతం సంపద

దేశఆదాయంలో 58%.. ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది.భారత్‌లోని 40శాతం సంపద అంతా ఒకే ఒక్క శాతంమంది సంపన్నుల వద్ద ఉంది.భారత్‌లో ధనవంతులు మరింత ధనవంతులు అవుతున్నారు. స్థూల జాతీయాదాయం పెరుగుతు న్నప్పటికీ చాలా దేశాల్లో ఆర్థిక అసమానతలు మాత్రం ఆశించిన స్థాయిలో తగ్గడం లేదని తాజా అధ్యయనమొకటి వెల్లడించింది. 2023నాటికి ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం జనాభా.. ఆదాయ అసమానతలు



పెరిగిన దేశాల్లోనే ఉందని పేర్కొంది. 1990తో పోలిస్తే మాత్రం అంతర్జాతీయ జనాభాలో 94శాతం మంది స్థూల జాతీయాదాయం పెరిగిందని తెలిపింది. దేశాల్లో, దేశాల మధ్య అసమానతలను తగ్గించడం ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ) పదోది. దాన్ని సాధించడంలో ప్రపంచ పురో గతిని గుర్తించేందుకు ఫిన్లాండ్‌లోని ఆల్టో విశ్వవిద్యాలయం సహా పలుఇతర సంస్థలకు చెందిన పరిశోధకులు భారత్, బ్రెజిల్, చైనా తదితర దేశాల్లో ఉమ్మడిగా తాజా అధ్యయనాన్ని నిర్వహించారు. సంబంధిత వివరాలు 'నేచర్ సస్టెయినబిలిటీ' అనేజర్నల్‌లో ప్రచురి తమయ్యాయి. అందులోని వివరాల ప్రకారం..2023 నాటికి ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది.. అసమానతలు తగ్గిన దేశాల్లో నివసిస్తున్నారు. – నాలుగింట ఒక వంతు మంది.. 1990తో పోలిస్తే ఆదాయం, అసమానతలు రెండూ గణనీయంగా పెరిగిన ప్రాంతాల్లో ఉన్నారు. ఉత్తర భారత దేశంలో అసమానతలు స్థిరంగా ఉన్నాయి. దక్షిణ భారత రాష్ట్రాల్లో మాత్రం సమ్మిళిత పు రోగతి కనిపించింది. ప్రజారోగ్యం, విద్య, మౌలిక వసతుల రంగా ల్లో పెట్టుబడులు పెరగడం, ఆర్థికాభివృద్ధి అందుకు దోహదపడ్డా యి. బ్రెజిల్‌లో పేద కుటుంబాలకు నగదు బదిలీ పథకాలు అసమానతలను తగ్గించేందుకు ఉపకరిస్తున్నాయి పేదలు మరింత పేదరికంలో కూరుకుపోతున్నారు" అన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఉంది. ప్రస్తుతం జపాన్‌ను సైతం అధిగమించి ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగినప్పటికీ మన దేశంలో ఆర్థిక అసమానతలు ఏ మాత్రం తగ్గడం లేదు.ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత ఆర్థిక అసమానత భారత్‌లో ఉందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026లో పేర్కొన్నారు. ఆ రిపోర్ట్ ప్రకారం.. దేశంలోని 40 శాతం సంపద ఒకే ఒక్క శాతం మంది వద్ద ఉంది.వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026 అంచనాలను విశ్లేషకులు లుకాస్ చాన్సెల్, రికార్డో గోమెస్ కరెరా, రోవైదా మోష్రిఫ్, థామస్ పికెట్టి ఎడిట్ చేసి, ప్రచురించారు.ఇటీవలి కాలంలో అసమానతలు తగ్గే సూచనలు కనపడకుండాపోయాయని ఆ రిపోర్టు తెలిపింది. భారత్‌లోని అత్యంత సంపన్న 10% వర్గం సుమారు 65% సంపదను పొందుతోందని నివేదిక తెలిపింది.ఆదాయ అసమానల తు కూడా మామూలుగా లేవు. దేశ ఆదాయంలో 58% ఉన్నత వర్గంలో ఉన్న టాప్ 10% వారికే దక్కుతోంది. కిందిస్థాయిలో ఉన్న50% వర్గం వారికి దేశ ఆదాయంలో కేవలం 15% మాత్రమే దక్కుతోంది.2014 నుంచి 2024 వరకు దేశంలోని సంపన్న టాప్10% వర్గం, బాటమ్‌లోని 50% వర్గం మధ్య ఆదాయం వ్యత్యాసం స్థిరంగా ఉందని నివేదిక తెలిపింది. అంటే పదేళ్ల క్రితం దేశంలో అసమానతలు ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి.భారతదేశంలో సగటు వార్షిక ఆదాయం పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 6,200 యూరోస్, అంటే దాదాపు రూ.6.49 లక్షలు. సగటు సంపద పర్చేసింగ్ పవర్ పారిటీ ఆధారంగా సుమారు 28000 యూరోస్. మహిళల శ్రమ భాగస్వామ్యం 15.7% మాత్రమే ఉందని, గత దశాబ్దంలో పెరుగుదల లేకపోయిందని నివేదిక తెలిపింది.ఇక మొత్తంగా భారతదేశంలో ఆదాయం, సంపద, లింగ పరమైన అసమానతలు అధికంగా కొనసాగుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో నిర్మాణాత్మక విభేదాలుస్పష్టంగా ఉన్నాయని ఇది సూచించింది.140 కోట్ల జనాభాలో దాదాపు 100 కోట్ల మంది తమ ఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు స్థిరమైన ఆదాయంతో స్వేచ్ఛగా ఖర్చు చేయగలిగే వారు కేవలం 13–14 కోట్ల మంది మాత్రమేనని ఈ అధ్యయనం సూచిస్తోంది. అంటే భారత మార్కెట్‌ను అర్థం చేసుకోవాలంటే కేవలంజనాభా పరంగా కాకుండా,ప్రజల ఆదాయ స్థాయిలను,ఖర్చు విధానాలను విశ్లేషించడం అవసరం. భారత్‌లో ఆర్థిక అసమతుల్యత గణనీయంగా ఉంది. నగరాల్లో ఉన్నత, మధ్య తరగతులకు మంచి ఆదాయ వృద్ధి కనిపిస్తున్నా, గ్రామీణప్రాంతాల్లో ఇంకా తక్కువ ఆదాయ స్థాయిలు కొనసాగుతున్నాయి. ఆదాయ వ్యవస్థ మెరుగుపడకపోతే వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరగదు.దేశంలో చాలా మంది అనిశ్చిత ఉపాధిపై ఆధారపడటంతో, నిర్దిష్ట ఆదాయ స్థాయిని చేరుకోవడం కష్టమవుతోంది. 100 కోట్ల మంది వినియోగదారులు వ్యక్తిగతఖర్చులను గణనీయంగా పరిమితం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారు. వీరి ఆదాయం ప్రధానంగా ఆహారం, వైద్యం, విద్య వంటి అవసరాలకే సరిపోతోంది. విలాస వస్తువులు, గృహోపకరణాలు, వినోదం, టూరిజం వంటి విభాగాల్లో వీరు పెద్దగా ఖర్చు చేయడం లేదు. ఈ వాస్తవం మార్కెట్ వ్యూహాలపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. మధ్యతరగతి, ఉన్నత వర్గాలే లక్ష్యం. భారతమార్కెట్‌ను అనేక కంపెనీలు మధ్యతరగతి, ఉన్నత వర్గాలను లక్ష్యంగా పెట్టుకుని అభివృద్ధి చేశాయి. అయితే,వినియోగ సామర్థ్యం పరంగా చూస్తే, తక్కువ ఆదాయం గల వినియోగదారులు పెద్ద సంఖ్యలో ఉన్నందున, మార్కెట్ వ్యూహాలను పునరాలోచించాల్సిన అవసరం ఉంది. ప్రీమియం ఉత్పత్తులతో పాటు, బడ్జెట్ –ఫ్రెండ్లీ ప్రోడక్ట్స్, స్థిరమైన ధరల వ్యూహాలు, ఫైనాన్స్– ఆధారిత వినియోగ మోడల్స్ ద్వారా ఈ వర్గాన్ని ఆకర్షించే మార్గాలను పరిశీలించాలి. భారత మార్కెట్ వృద్ధి కొనసాగాలంటే కేవలం ఉన్నత ఆదాయ వర్గాలను లక్ష్యంగా పెట్టుకోవడం సరిపోదు. తక్కువ ఆదాయ గల వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని, వారికి అందుబాటులో ఉండే ఉత్పత్తులు, సేవలు రూపొందించాలి. సరసమైన ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులోకి తేవడం, ఈఎంఐ లేదా ఫైనాన్స్ మోడళ్లను ప్రవేశపెట్టడం, గ్రామీణ మార్కె ట్లకుచేరువ కావడం ద్వారా వినియోగదారుల స్థాయిని విస్తరించు కోవచ్చు. డిజిటల్ విస్తరణ ద్వారా కూడా ఈ వర్గానికి మార్కెట్‌ను మరింతచేరువ చేయొచ్చు.ఈ మార్గాల్లో వ్యూహాలు అమలు చేస్తే తక్కువ ఆదాయంగల వినియోగదారుల ఖర్చు సామర్థ్యం పెరిగి, భారత ఆర్థికవృద్ధికి కొత్త దిశలో ఉత్సాహం లభించవచ్చు. ఆర్థిక అసమతుల్యతను అధిగమించాలంటే ఉపాధి కల్పన సరైన పరిష్కా రంగా పరిగణించాలి. ప్రజల ఆదాయాన్ని పెంచేలా.. ప్రభుత్వ కార్యక్రమాలు.. ఉద్యోగ కల్పన పెంచడం, కార్మిక వేతనాలు పె ంచడం

# దాతలు సహాయం అందించండి 8 నెలల పాపకు పునర్జన్మ ఇద్దాం

### మనం చేసే సహాయం చిన్నారి జీవితానికి వెలుగు-సహకరిస్తున్న దాతలకు ధన్యవాదములువి.ఎస్.ఎస్.ఎస్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా , సురభి శ్రీధర్

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) బుడిబుడి అడుగులతో ఇప్పుడిప్పుడే అడుగులు వేస్తున్న చిన్నారి వేదశ్రీ ని. ఓ మాయదారి రోగం ఇబ్బంది పెడుతుంది. పెద్దపల్లి జిల్లా రామగుండం అయోధ్య నగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ వీరిశెట్టి శేఖర్ – భవాని దంపతుల కుమార్తె 8 నెలల పాప వేదశ్రీకి మెదడుకు ఆక్సిజన్ అందక న్యూరో ప్రాబ్లమ్ తో బాధపడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. గత నెల 23న, చిన్నారి వేదశ్రీకి ఫిట్స్ రావడంతో కరీంనగర్ హాస్పిటల్ కి తీసుకోనివెళ్లగా మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాద్ కొండాపూర్ లోని కిమ్స్ హాస్పిటల్ లో చిన్నారిని అడ్మిట్ చేసి వైద్య సేవ అందిస్తున్నారు. గత 30 రోజులుగా హాస్పిటల్ ఉంటూ వైద్య సేవలు పొందుతున్న చిన్నారికి వైద్య ఖర్చులకోసం 30 లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని వైద్యులు తెలుపగా వైద్య ఖర్చులకోసం చిన్నారి కుటుంబ సభ్యులు దాతల సహకారం కోరుతున్నారు. దాతలు ఎవరైనా ఉంటే చిన్నరి వైద్య సహాయం కోసం సహాయం అందించాలని. వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ దాతలను కోరారు. సహాయం అందించే దాతలు 9963142880 నంబర్ కు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా సహాయం అందించాలని తెలిపారు. మనం చేసే ఈ సహాయం చిన్నారి జీవితానికి వెలుగు ఇచ్చిన వాళ్ళం అవుతామని సురభి శ్రీధర్ అన్నారు. దాతలు స్పందించాలని చిన్నారికి పునర్జన్మను ఇవ్వాలని దాతలు సురభి శ్రీధర్ కోరారు.



### రేడియం స్టిక్కర్లతో ప్రతిబింబాలు ప్రమాదాల నియంత్రణకు రామగుండం ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో

# రాజీవ్ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు




(తెలంగాణ అవతరణ. మార్కండేయ కాలనీ) రామగుండం ట్రాఫిక్ పోలీసులు ప్రమాదాలను అరికట్టేందుకు ఒక చొరవగా రాజీవ్ రహదారిపై బోర్డింగ్స్ (స్పీడ్ బ్రేకర్లు)ను ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ స్పీడ్ బ్రేకర్లకు రేడియం స్టిక్కర్లను అతికించి, రాత్రిపూట వాటి దృశ్యతను పెంచారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ, "రోడ్డుకు ఇరువైపులా ఉండే ఈ స్టాపర్ల వలన వాహనాల వేగం నియంత్రణకు లోబడుతుంది. దీనివలన ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పడుతుంది" అని తెలిపారు.వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్, హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ సంబంధిత పత్రాలను కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనం నడపవద్దని ఏసీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వరరావు, ట్రాఫిక్ సిబ్బంది, హెచ్కేఆర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో విద్యా వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం

### "విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయం" -- కార్పొరేటర్ శ్యామణి రమేష్

(తెలంగాణ అవతరణ, మార్కండేయ కాలనీ) ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ఎడ్యుకేషన్ వీక్ (విద్యా వారోత్సవాలు) మూడవ రోజు, గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి, విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి ఆవుల శ్యామణి రమేష్ ప్రచార పోస్టర్, కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం ఇంటర్ విద్యార్థులతో ముచ్చటిస్తూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న సాంప్రదాయ, జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు, హాస్టల్ వసతి, వివిధ స్కాలర్షిప్లు, ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక విభాగాలు, మైదానం, క్రీడలు, ఉచిత బోధన, వర్క్షాప్లు, సెమినార్లు, ప్రాజెక్ట్ వర్క్ గురించి వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు తమ వివరాలను 'దోస్త్' పోర్టల్లో నమోదు చేసుకోవాలని కోరారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ శ్రీమతి శ్యామణి రమేష్ మాట్లాడుతూ -- "గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ రంగాల్లో విశేష విజయాలు సాధిస్తున్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దే అధ్యాపకుల కృషి ప్రశంసనీయం. రామగుండం,




చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు డిగ్రీ చదువుల కోసం ఈ కళాశాలను ఎంచుకోవాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ. సాంబశివరావు, దోస్త్ కోఆర్డినేటర్ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఏ. నరేష్, డా. ఏ. సురేష్, డా. పి. శంకరయ్య, డా. రామకృష్ణ, డా. వి. నరేష్, సమత, సుమలత, ఉషారాణి తదితర అధ్యాపకులు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది శ్రీలత, కలీమ్, సతీష్, షకూర్, జలజ పాల్గొన్నారు.

# మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం ఆర్జీ.I

(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) ఉత్పత్తి మరియు ఉత్పాదకత పెంపు లక్ష్యంగా రామగుండం–1 ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ సమావేశాలు ప్రారంభం రామగుండం: సింగరేణి వ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి మరియు ఉత్పాదకతను మెరుగుపరిచే లక్ష్యంతో, చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం ఏరియా–1 లో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్స్ మావేశాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జి.ఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరియా జనరల్ మేనేజర్ డి. లలిత్ కుమార్ వివరాలను వెల్లడించారు. ముఖ్య అంశాలు: సమావేశాల లక్ష్యం: గనుల్లో ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడం, ఉత్పాదకతను పెంచడం, భారీ యంత్రాల పని గంటలను సమర్థవంతంగా వినియోగించుకోవడం మరియు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడం వంటి అంశాలపై ఈ బృందాలు క్షేత్రస్థాయిలో పని చేస్తాయి. షెడ్యూల్: మే 13 నుండి 15 వరకు ఏరియా స్థాయి అధికారులు, యూనియన్ ప్రతినిధులు మరియు ఉత్తమ కార్మికులకు శిక్షణ మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం మే 18 నుండి ఏరియాలోని అన్ని గనులు మరియు విభాగాల్లో కార్మికులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తారు. టీమ్ సభ్యులు: ఏరియా జి.ఎం నాయకత్వంలో జువీ ఇంజనీర్, ఫైనాన్స్ హెడ్, పర్సనల్ హెడ్, ఐ.ఇ.డి మరియు క్వాలిటీ విభాగాల అధికారులు ఈ బృందంలో సభ్యులుగా ఉండి గనుల సందర్శన చేస్తారు. ఈ సందర్భంగా జి.ఎం మాట్లాడుతూ,




గనుల వారీగా ప్రత్యేక ప్రజెంటేషన్ల ద్వారా కార్మికులకు ప్రస్తుత అవసరాలను వివరిస్తామని తెలిపారు. మే 23 వరకు కొనసాగే ఈ ప్రత్యేక పర్యటనల్లో +ఞఖ–1, 3 ఇంక్లైన్, +ఞఖ–11, ాజూ మరియు వర్క్ షాప్ వంటి విభాగాల్లో విస్తృతంగా సమావేశాలు నిర్వహించి, కార్మికుల సలహాలు మరియు ఫీడ్బ్యాక్ తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమములో జియం ఆర్ జి. 1 డి.లలిత్ కుమార్, ఏరియా ఇంజనీర్ రామ్మోహన్ రావు, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఐఇడియ. స్ ఇ రాజన్న, సీనియర్ పిఒ హనుమంతరావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి గార్లు పాల్గొన్నారు

# వైసీపీలో మారుతున్న సామాజిక లెక్కలు

విజయవాడ, : వైఎస్సార్ పార్టీ.. ఏపీలో విపక్షం. మాజీ సీఎం వైఎస్సార్ తనయుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర విభజన, కాంగ్రెస్ వైఖరితో విభేదించి కొత్తపార్టీ పెట్టిన రాజకీయ అసాధ్యుడు. ఐదేళ్ల విపక్ష బాధ్యతల తర్వాత 2019లో అధికారాన్ని సైతం సాధించి, సీఎంగా పాలన సాగించారు. పరిపాలన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ప్రజామోదం లేకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, లోకేష్ అలుపెరగక చేపట్టిన ప్రచారంతో.. వైసీపీ ఘోరంగా ఓటమి పాలైంది. బేసిగ్గా చూస్తే.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో ఎక్కువ పదవులు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయా సామాజిక వర్గం నేతలు.. రాజకీయాల్లో హడావుడి చేసేవారు. వారు కోటరీ కట్టి జగన్ కు కళ్లు, చెవులుగా వ్యవహరిం చారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి నేతలు పవర్ పోవడం, లోకేష్ రెడ్ బుక్ లాంటి పరిణామాలతో కాస్త సైలెంట్ అయ్యారు. వారిస్థానాల్లో ఇప్పుడు బీసీ, ఎస్సీ ఎస్టీ నేతలు .. ముందుండి పార్టీ కార్యక్రమాలను నడుపుతున్నారు.బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా చురుకుగా వ్యవహరిస్తుండగా, అంబటి రాంబాబు, పేర్ని నాని పార్టీ స్వరంగా నిలుస్తున్నారు. జోగి రమేష్ కూడా బెయిల్‌పై విడుదలైన తర్వాత తన స్వరాన్ని మరింత పెంచారు. పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో వీరే ముందుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే? వైసీపీలో సామాజిక సమీకరణాలు కొత్త దిశగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కష్టకాలంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన నేతలు ముందుకు వచ్చి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో జగన్‌కు సమీపంగా ఉన్న నేతలు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇదే నేతలు ఒక వేళ జగన్రాజకీయంగా పుంజుకుంటే మళ్లీ ఆయన పక్కకు చేరతారని, కోటరీ కడతారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జగన్ అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన మంత్రి పదవులను అప్పగించారు. జగన్ హయాం లో దాదాపు 24 మంది ప్రభుత్వ సలహాదారులలో 17 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉండటం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే నేతలు మౌనంగా ఉండడానికి కారణం ఏమిటనే చర్చ సాగుతోంది.

## కామారెడ్డి జిల్లాలో విషాదం..

### కోతుల గుంపుపై విష ప్రయోగం, పలు వానరాలు మృతి



హైదరాబాద్ : కామారెడ్డిజిల్లా విషాదం చోటు చేసుకుంది. కోతులపై విషయ ప్రయోగం చేయడంతో పది కోతులు మృతి చెందాయి. మరికొన్ని కోతులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుండా పశువైద్య సిబ్బంది కాపాడారు. ఈ విషాదాకర సంఘటన బిక్కనూరు మండలం అంతంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని వ్యక్తులు కోతులను అంతంపల్లి సమీపంలోని ఓ హోటల్ వద్ద వదిలిపోయారు. కోతులు మృతి చెంది ఉండటాన్ని గమనించిన స్థానిక సర్పంచ్ వదిలిపెట్టనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఇటీవల కాలంలో దుండగులు మూగజీవాలకు విషం పెట్టి చంపి వేస్తున్న సంఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.



# వాయిదా వేద్దాం..



ప్రస్తుత డిజిటల్ యుగంలో.. చాలామంది స్మార్ట్‌ఫోనే ప్రపంచంగా బతికేస్తున్నారు. ఉదయం లేవగానే.. ఫోన్‌ను చేతిలోకి తీసుకుంటున్నారు. మంచం మీదినుంచే.. సోషల్ మీడియా మెసేజ్‌లు, తాజా వార్తల ను తనిఖీ చేస్తున్నారు. అయితే, ఈ అలవాటు మెదడు పనితీరుపై తీవ్రంగా ప్రభావం చూపుతుందని న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సైంటిస్ట్‌లు హెచ్చరిస్తున్నారు. ఉదయాన్నే ఫోన్‌లో తలదూర్చడం వల్ల.. ఆలోచనా విధానం, సృజనాత్మక సామర్థ్యం దెబ్బతింటుందని చెబుతున్నారు. ఉదయం మేల్కొన్న తర్వాతి మొదటి 15-20 నిమిషాలు మెదడుకు చాలా ముఖ్యమైన సమయం. అప్పుడే మెదడు 'పీక్ న్యూరోప్లాస్టిక్ మోడ్'లోకి ప్రవేశిస్తుంది. అంటే.. ఏదైనా నేర్చుకోవడానికి, మార్పులను స్వీకరించడానికి మెదడుకు ఉండే సామర్థ్యం. రాత్రంతా నిద్రలో ఉండి.. ఉదయాన్నే మేల్కొన్నప్పుడు ఈ సామర్థ్యం అత్యధిక స్థాయిలో ఉంటుందట. కాబట్టి, ఏదైనా ప్రేరణ కలగడానికి, దృష్టిని మెరుగుపరుచుకోవడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి, సృజనాత్మకంగా ఉండటానికి.. మెదడుకు ఇదే సరైన సమయమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కానీ, ఆ సమయంలో ఫోన్‌తో గడపడం వల్ల.. మెదడు సృజనాత్మక ఆలోచనలపై ప్రభావం పడుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా.. ఉదయాన్నే ఏదైనా ఇబ్బందికర సమాచారం, వార్తల గురించి విన్నప్పుడు మెదడు 'హై అలర్ట్' మోడ్‌లోకి వెళ్తుందట. మంచం మీదినుంచి లేవడానికి ముందే.. మెదడులో ఆందోళన, ఒత్తిడి పెరుగుతుందట. దీనిని నివారించడానికి '20 నిమిషాల ట్రిక్'ను అనుసరించాలని చెబుతున్నారు. నిద్ర లేచిన వెంటనే కాకుండా ఫోన్‌ను చూడటాన్ని 20 నిమిషాలు ఆలస్యం చేయాలని చెబుతున్నారు. మొదటి 20 నిమిషాలు ప్రశాంతంగా, సానుకూలంగా ఏదో ఒక పనిచేయాలని సూచిస్తున్నారు. చిన్నపాటి ఎక్సర్‌సైజ్‌లు చేయడం, రోజువారీ చేయాల్సిన పనుల లిస్ట్‌ను తయారు చేసుకోవడం, ప్రధాన లక్ష్యాల గురించి ఆలోచించడం చేయాలని అంటున్నారు. మెదడుపై సానుకూల ప్రభావం చూపుతుందనీ, ఏకాగ్రత, సంతోషం పెరుగుతాయనీ చెబుతున్నారు.

# వేళ్ల మధ్య దురద, పగుళ్లు ఇలా పోగొట్టుకోండి..



వర్షాకాలం వచ్చిందంటే చాలు, వాతావరణంలో తేమ పెరిగి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. వీటిలో సాధారణంగా కనిపించే ఒక సమస్య కాలి వేళ్ళ మధ్య ఫంగల్ ఇన్ఫెక్షన్ లేదా పాదం పగు ళ్లు. దీనివల్ల చాలాసార్లు కాలి వేళ్ళ మధ్య విపరీతమైన దురద వస్తుంది, చర్మం పగులుతుంది. ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి కొన్ని ఇంటి చిట్కాలు పాటిస్తే చాలు.

ఆవాల నూనె, వెల్లుల్లి : 2-3 వెల్లుల్లి రెబ్బలను ఆవాల నూనెలో వేసి వేడి చేయాలి. చల్లారిన తర్వాత ఈ నూనెను కాలి వేళ్ళ మధ్య రాయాలి. ఆవాలు, వెల్లుల్లిలో ఉండే యాంటీ-ఫంగల్, యాంటీ-బ్యాక్టీరియల్ గుణాలు పగుళ్లను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి. ఈ పద్ధతిని సాధారణంగా చాలా మంది ఉపయోగిస్తారు.రావి చెట్టు బెరడు నీరు : రావిచెట్టు ఎండుబెరడునునీటిలో మరిగిం చాలి. ఆ గోరువెచ్చని నీటితో రోజుకు రెండుసార్లు 10-15 నిమిషాల పాటు పాదాలను కడగాలి. రావి బెరడులో యాంటీసెప్టిక్ గుణాలు ఉంటాయి, ఇవి గాయాలను, ఇన్‌ఫెక్షన్లను వేగంగా నయం చేస్తాయి.పసుపు, కొబ్బరి నూనె : 1 చెంచా పసుపులో కొద్దిగా కొబ్బరి నూనె కలిపి పేస్ట్‌గా చేసి, పగుళ్ల లేదా ఇన్‌ఫెక్షన్ ఉన్న చోట రోజుకు రెండుసార్లు రాయాలి. పసుపు ఇన్‌ఫెక్షన్లను తొలగిస్తుంది కొబ్బరి నూనె తేమను అందించి చర్మం పొడిగా మారకుండా చూస్తుంది.వేప ఆకుల మరిగించిన నీరు : 10-15 వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటితో రోజుకు రెండుసార్లు పాదాలను కడగాలి. వేపకు శక్తివంతమైన యాంటీబ్యాక్టీరియల్, యాంటీఫంగల్ గుణాలు ఉన్నాయి, ఇవి చర్మ సమస్యలను దూరం చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తాయి.

# లక్షణాలు గుర్తిస్తే.. ప్రమాదం దూరం

క్యాన్సర్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా క్యాన్సర్ మహమ్మారి అందర్నీ ప్రమాదంలోకి నెట్టేస్తున్నది. అయితే క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాన్ని తగ్గించొచ్చు. సరైన సమయంలో వైద్యం తీసుకుంటే ప్రాణాపాయస్థితి నుంచి బయటపడి, సాధారణ జీవితం గడపొచ్చు. చాలామంది క్యాన్సర్ లక్షణాలపై అవగాహన లేక సమస్యను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ పది లక్షణాలను గమనించి, వెంటనే వైద్యుణ్ని సంప్రదిస్తే.. ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చు.

అకస్మాత్తుగా బరువు తగ్గడం: ఒకే నెలలో నాలుగైదు కిలోలు తగ్గుతు న్నారంటే జాగ్రత్త పడాలి. కిలోల కొద్దీ బరువు ఒకేసారి తగ్గితే, అది కడుపు, అన్నవాహిక, ఊపిరితిత్తులు, క్లోమ క్యాన్సర్ లక్షణం కావచ్చు.

ఎక్కువ అలసట: చిన్నచిన్న పనులకే ఎక్కువగా అలసిపోతున్నా, అది క్యాన్సర్ లక్షణం కావచ్చు. లుకేమియా లేదా లింఫోమా వంటి బ్లడ్ క్యాన్సర్లలో కూడా ఈ లక్షణం ఉంటుంది.

కణుతులు: మెడ, చంక మొదలైన చోట్ల కొత్తగా గడ్డలు కనిపించినా, లేదాచిన్న గడ్డలుగట్టిపడినా,పెద్దగాపెరిగినా వెంటనేడాక్టర్‌ను సంప్రదించాలి.అదిరొమ్ము,వృషణాలు,శోషరస సంబంధితక్యాన్సర్ కావచ్చు. చర్మం-పుట్టుమచ్చల్లో మార్పు: కొత్త పుట్టుమచ్చలు పుట్టుకురావడం, పాత మచ్చల రంగు, పరిమాణంలో మార్పులు, వాటిలోంచి రక్తం రావడం లాంటివి

క్యాన్సర్ లక్షణాలుగా చెబుతారు. అందుకే చర్మ సమస్యలను ఎప్పుడూ నిర్లక్ష్యం చేయొద్దు. బ్లీడింగ్ ప్రమాదమే: మూత్రం, మలం, వాంతి, దగ్గులో రక్తం కనిపిస్తే, వెంటనే అప్రమత్తం అవ్వాలి. అవన్నీ మూత్రాశయ, పెద్దపేగు, కడుపు, ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలు ఉంటాయి.

ఆగని దగ్గు: వారాలు గడిచినా దగ్గు తగ్గకుండా, రక్తం పడుతున్నట్ల



యితే అది కేవలం ఇన్ఫెక్షన్ కాకపోవచ్చు. గొంతు, ఊపిరితిత్తులు, థైరాయిడ్ క్యాన్సర్‌కు సూచన అనుకొని జాగ్రత్తపడటం మంచిది.

అజీర్తి-మింగడంలోఇబ్బంది: ఆహారం మింగడంలో ఇబ్బందిగా ఉన్నా,ఛాతీలోమంట, అజీర్తి సమస్యలు

దీర్ఘకాలంగా ఉంటే,వెంటనే అప్ర మత్తం అవ్వాలి.అది గొంతు,కడుపు ,అన్నవాహికక్యాన్సర్‌కు దారితీయొచ్చు. విసర్జన వేళల్లో మార్పులు: మల విసర్జన సమయాల్లో మార్పులు, అతిసారం, మలబద్ధకం, మలంలో రక్తం, మూత్రంలో మంట మొదలైనవి మూత్రాశయ, పెద్దపేగు, వీర్యగ్రంథి క్యాన్సర్ లక్షణాలు. వీటిలో ఏవి ఎక్కువ రోజులున్నా డాక్టర్‌ను సంప్రదించాలి.

విపరీతమైన నొప్పి: ఎముకలు, క్లోమం, అండాశయాల్లో క్యాన్సర్ ఉన్నప్పుడు.. కడుపు, వీపులేదా కీళ్లలో నొప్పి విపరీతంగా ఉంటుంది. రోజులు గడిచినా ట్యాబ్లెట్లతో తగ్గకుంటే,

వైద్యుణ్ని కలవడం అవసరం. రాత్రుళ్లు చెమటలు: తరచూ జ్వరం, రాత్రుళ్లు చెమటలు పట్టడం, వరుసగా ఇన్ఫెక్షన్లు లాంటివి కూడా క్యాన్సర్ లక్షణాలు అయ్యుండొచ్చు. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన కంగారు పడాల్సిన అవసరం లేదు. ఇవి దీర్ఘకాలం కొనసాగితే మాత్రం జాగ్రత్తపడటం తప్పనిసరి

# యువతలో గుండెపోటులు ఎందుకు..



హైదరాబాద్, : ఇటీవల ఉప్పల్‌లో ఓ యువకుడు బ్యాడ్మింటన్ ఆడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీనికి కారణం అతడికి సడన్ కార్డియాక్ అరెస్ట్ కావడమే. సికింద్రాబాద్‌కు చెందిన 24ఏళ్ల యువకుడు జిమ్‌లో కసరత్తులు చేస్తూ ఇటీవల గుండెపోటుతో అక్కడికక్కడే చనిపోయాడు. ఇక్కడా గుండెపోటే కారణం. ఇలా ఇటీవల చాలామంది యువకులు ముఖ్యంగా 30 ఏళ్లలోపే గుండెపోటుకు గురవుతున్నారు. వీటన్నిటికీ కారణాలేంటి? ఈ యువత గుండెకు ఏమైంది. అంత వీక్‌గా మనోళ్లు ఉన్నారా? అన్న అంశాలు ఇప్పుడు చర్చనీయాంశం కానున్నాయి.తమ దగ్గరికి వచ్చే గుండె జబ్బు బాధితుల్లో యువకులే ఎక్కువగా ఉంటున్నారని హృద్రోగ నిపుణులు కూడా చెబుతున్నారు. ఒకప్పుడు 50, 60 ఏళ్ల వయసు దాటిన వారిలోనే కనిపించే గుండె జబ్బులు.. ఇప్పుడు 20-30 ఏళ్ల వయసు వారిలోనూ చోటు చేసుకుంటున్నాయని హెచ్చరిస్తున్నారు. రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడడం, కండరాల వాపు వంటి వాటితో పాటు అంతకుముందు కుటుంబంలో ఎవరికో ఒకరికి ఈ జబ్బులు ఉంటేఈ పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. చిన్నప్పటి నుంచే జంక్ ఫుడ్‌ను అధిక మొత్తంలో తీసుకుంటుండటం వల్ల కొవ్వు శాతం పెరిగి గుండె స్పందనల్లో తేడాలొస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొందరికి పుట్టుకతోనే గుండె జబ్బులు వస్తాయంటున్నారు. ఇక మాదక ద్రవ్యాలు, ధూమపానం, మద్యపానం చేసే వారిలోనూ గుండె సమస్యలొచ్చే ముప్పు అధికమని అంటున్నారు. అందుకే 25 ఏళ్లు దాటినప్పటి నుంచే గుండె ఆరోగ్యాన్ని తెలిపే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.చిన్న వయసులోనే క్రీడాకారులు ఇలాంటి ఆకస్మిక మరణానికి గురైతే హెచ్‌సీఎం- హైపర్‌ట్రోఫిక్ కార్డియోమయోపతి కారణం అయి ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారిలో గుండె కండరాలు లావుగా ఉంటాయి. ఇది వంశపారంపర్యంగా వచ్చి ఉంటుంది. వ్యాయామం చేసే సమయంలో గుండె నిమిషానికి 210 సార్లకంటే ఎక్కువగా కొట్టుకోవడం ద్వారా దాని చలనం ఆగిపోయి.. రక్తప్రసరణ జరగకుం డా చనిపోతారు. యువకుల్లోనే ఇలాంటివి కనిపిస్తాయి. అథ్లెట్లు, క్రీడాకారులు కొన్ని రకాల స్టెరాయిడ్లు వినియోగించినా కండరాలు అధికంగా సంకోచ వ్యాకోచాలకు గురై ఒక దశలో ఆగిపోయి చనిపోతారు. వ్యాయామానికి ముందు యువకులు తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. తల్లిదండ్రులకు ఇతర రక్తసంబంధీకులకు గుండెజబ్బులు ఉంటే వారు జాగ్రత్తలు తీసుకోవాలి.అలాగే మధుమేహం, అధిక రక్తపోటు రక్తనాళాలను దెబ్బతీసి, కొవ్వు పేరుకుపోయి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. షుగర్ ఉంటే 2 నుంచి 3 రెట్లు ఎక్కువ ముప్పు ఉంటుంది. కొవిడ్ వైరస్ గుండె కండరాలకు వాపు కలిగించవచ్చు. ఇది కూడా గుండె పోటు ప్రమాదాన్ని పెంచవ చ్చు. యువతలో గుండెపోటు నివారించడా నికి పండ్లు, కూరగా యలు, చేపలు, చికెన్, తృణధాన్యాల వంటి ఆహారాన్ని తీసుకోవాలం టున్నారు డాక్టర్లు. రోజూ ఎక్సర్‌సైజులు చేయాలని సూచిస్తున్నారు. 40 సంవత్సరాలు పైబడిన వారు నడుస్తూనో.. వ్యాయామం చేస్తూనో.. గుండెనొప్పితో కుప్పకూలిపోతు న్నారు. కార్డియాక్ అరెస్ట కావడమే ఇలాంటి ఘటనలకు కారణం.రక్తనాళాల్లో బ్లాక్‌లు ఉన్నా.. ముందే గుర్తించకపోవడం వల్ల ఇలా జరుగుతుంది. ఆహారం ఊపిరితిత్తులకు చేరడం వల్ల రక్తనాళాల్లో అడ్డుపడి మృత్యువాత పడతారు.

స్టెరాయిడ్లు వాడకూడదు. చిన్న వ్యాయామాలకైనా.. పరిగెత్తినా అలసటగా ఉంటే వెంటనే గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. సడన్ స్ట్రోక్ వచ్చే వారిలో సగం మంది ఆస్పత్రికి చేరకుండానే మరణిస్తున్నారు. గుండెపోటు వచ్చిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటారు.. అప్పుడు తక్షణ చికిత్స అందిస్తే బాధితుడి కాపాడుకోవచ్చు. సీపీఆర్ చేయడం ప్రతీ ఒక్కరు నేర్చుకోవాలంటున్నారు వైద్యులు.

# ఆహారం.. అనుబంధం!



మనదేశంలో ఆహారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. భోజనంగానే కాకుండా.. ఆచార వ్యవహారాలు, మత విశ్వాసాల్లోనూ ఆహారం కీలకంగా కనిపిస్తుంది. విలువలు, సంస్కృతి, సౌకర్యంతోపాటు గుర్తింపును కూడా ప్రతిబింబిస్తుంది. అయితే, అదే ఆహారం.. 'జెనరేషన్ జెడ్' దంపతుల మధ్య గొడవలకు కారణం అవుతున్నది. బంధాలను విచ్ఛిన్నం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా.. వెగన్‌లు, శాకాహారులు, మాంసాహారులు ఉంటారు. కానీ, మనదేశంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఇక్కడ శాకాహారులైనా.. కొందరు కోడిగుడ్లతో చేసిన కేక్‌ను ఇష్టంగా తింటారు. మరికొందరు మాంసాహారులు.. కొన్ని ప్రత్యేక రోజుల్లో మాంసాన్ని దూరం పెడుతారు. అప్పుడప్పుడూ మాంసం తినడం, కొన్నిరకాల పదార్థాలనే తీసుకోవడం లాంటివాళ్లు ఇక్కడ కనిపిస్తారు. అయితే, ఇలాంటి విభిన్నమైన ఆహారపు అలవాట్లు.. 'జనరేషన్ జెడ్' దంపతుల మధ్య గొడవలు సృష్టిస్తున్నాయట. దంపతుల్లో ఒకరు శాకాహారి.. మరొకరు మాంసాహారి అయినప్పుడు.. ఇబ్బంది కలుగుతున్నదట. దాంతో ఒకే ఇంట్లో ప్రతిరోజూ రెండు వేర్వేరు వంటకాలను సిద్ధం చేయాల్సి వస్తున్నది. గృహిణులు సర్దుకుపోతున్నా.. ఉద్యోగాలు చేసేవారు అవస్థ పడుతున్నారు. ఇక ఉమ్మడి కుటుంబమైతే.. ఈ వంటల జాబితా మరింత పెరుగుతున్నది. అంతేకాకుండా.. తాము కోరుకున్న ఆహారం తినలేకపోతున్నామని కూడా నవతరం ఇల్లాళ్లు చెబుతున్నారు. అదే సమయంలో పెద్దవాళ్లు ఈ ఆహారపు గొడవలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పెద్ద విషయం కాదని కొట్టిపారేస్తున్నారు. ఆహారం విషయంలో సర్దుబాటు చేసుకోవడానికి ఈ తరం ఇష్టపడటం లేదని చెబుతున్నారు.

**బంధాలపై ప్రభావం..:** 'జెన్-జీ' దంపతులు ఇలా ఆహారం విషయంలో రాజీపడటం, గొడవపడటం.. వారి బంధాలపై ప్రతికూ ల ప్రభావం చూపుతుందని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంటి భోజనం విషయంలోనే కాదు.. విందులు, రెస్టారెంట్లకు వెళ్లినప్పుడు, ఇంటి సామగ్రి కొనుగోలు విషయాల్లోనూ తగాదాలకు దారితీయవచ్చని అంటున్నారు. అయితే, ఒకరి ఇష్టాలను గౌరవించ డం, కలిసి తినడం లాంటి చిన్న విషయాలే.. వారిలో భావోద్వేగ సంబంధాన్ని మెరుగుపరుస్తాయని చెబుతున్నారు. అందుకే.. ఒకరి అభిరుచులకు మరొకరు విలువ ఇచ్చి, మధ్యేమార్గాన్ని ఫాలో అయిపోతే.. ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావని సూచిస్తున్నారు. ఇలాంటి దంపతుల్లో భోజనం దాటవేయడం, అసమతుల్య ఆహారం తీసుకోవడం కనిపిస్తున్నదట. ఇది వారి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదట. అందుకే.. ఆహార వ్యత్యాసాల విషయంలో ఎదుటివారి భావోద్వేగాలను, ఆహారపు అలవాట్లను గౌరవించాలని చెబుతున్నారు. ఒకరినొకరు మార్చుకోవడానికి ప్రయత్నించకుండా.. ఇద్దరి అభిరుచులకూ డైనింగ్ టేబుల్‌పై చోటు కల్పించాలని సూచిస్తున్నారు. మధ్యేమార్గంగా ఇద్దరూ ఇష్టపడే ఉమ్మడి ఆహార వ్యవహారాలను సృష్టించుకోవాలని చెబుతున్నారు. అదే సమయంలో వంటలకు ఒక్కరినే బాధ్యులుగా చేయకుండా.. కలిసి వంట చేయడం ద్వారా భాగస్వామిపై భారం తగ్గడంతోపాటు ఇద్దరి మధ్యా బంధం మరింత బలపడుతుందని సలహా ఇస్తున్నారు.

# రోజూ ఉదయం పరగడుపునే కలబంద రసాన్ని తాగి చూడండి..



మన చుట్టూ ప్రకృతిలో అనేక రకాల మొక్కలు ఉంటాయి. వాటిల్లో ఔషధ గుణాలు ఉండే మొక్కలు చాలానే ఉన్నాయి. అలాంటి మొక్కల్లో కలబంద కూడా ఒకటి. కలబంద ఆకుల్లో ఉండే గుజ్జును సౌందర్య సాధన ఉత్పత్తుల్లో ఉపయోగిస్తారు. అయితే కలబంద ఆకుల గుజ్జుతో తయారు చేసే కలబంద రసాన్ని మనం తాగవచ్చు. దీన్ని రోజూ ఉదయం తాగాల్సి ఉంటుంది. ఈ రసాన్ని తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కలబంద రసాన్ని సేవిస్తే పలు వ్యాధులు నయమవుతాయని అంటున్నారు. ఈ రసంలో అమైలేజ్, లైపేజ్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి కొవ్వులు, పిండి పదార్థాలను జీర్ణం చేయడంలో సహాయం చేస్తాయి. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి ఏర్పడదు. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్యల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**అల్సర్లకు ఔషధం..:** కలబందలో సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ రసాన్ని తాగితే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్ధకం తగ్గుతుంది. కలబంద రసంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. కనుక పేగులు, జీర్ణాశయంలో వచ్చే వాపులను తగ్గిస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ రసాన్ని సేవిస్తుంటే ఇరిటబుల్ బౌల్ సింద్రోమ్ (ఐబీఎస్) అనే సమస్య తగ్గుతుంది. అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే అల్సర్లు నయమవుతాయి. కలబంద రసం సహజసిద్ధమైన డిటాక్సిఫైర్ గా పనిచేస్తుంది. ఈ రసాన్ని తాగితే శరీరంలో ఉన్న వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా క్లీన్ అవుతుంది. ముఖ్యంగా లివర్, కిడ్నీలు క్లీన్ అవుతాయి. శరీర భాగాలు ఆరోగ్యంగా ఉంటాయి. రక్తాన్ని శుద్ధి చేసేందుకు కూడా కలబంద రసం పనిచేస్తుంది.

**రోగ నిరోధక శక్తికి..:** కలబంద రసంలో పాలీ శాకరైడ్స్ ఉంటాయి. ఇవి తెల్ల రక్త కణాలను ఉత్పత్తి చేస్తాయి. దీంతో శరీరం బ్యాక్టీరియా, వైరస్‌లపై పోరాడుతుంది. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కలబంద రసంలో విటమిన్ సి కూడా అధికంగానే ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. ఈ రసంలో ఉండే జింక్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. కలబంద రసం సేవిస్తుంటే ఎలాంటి రోగాలు రాకుండా ఉంటాయి. కలబంద రసం చర్మానికి, జుట్టుకు కూడా మేలు చేస్తుంది. ఇందులో విటమిన్లు ఎ, సి, ఇ ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మానికి తేమ లభించేలా చేస్తాయి.




# ఆగమనానికి సిద్ధమవుతూ..



ప్రముఖ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో కె.అచ్చిరెడ్డి సమర్పణలో.. కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్న సందేశాత్మక యాక్షన్ చిత్రం 'వేదవ్యాస్'. పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయం అవుతున్న ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమాను నిర్మిస్తున్న 'సాయి ప్రగతి ఫిల్మ్స్' బ్యానర్ విజువల్ లోగో ఆవిష్కరణ హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వార్షికోత్సవ వేడుకలో ఘనంగా జరిగింది. షిర్డీ సాయిబాబా విగ్రహానికి దర్శకనిర్మాతలు, సమర్పకుడు కలిసి పూజ చేస్తున్న దృశ్యాన్ని లోగోలో చిత్రీకరించారు. నిర్మాత కొమ్మూరి ప్రతాపరెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, కె.అచ్చిరెడ్డి, హీరో పిడుగు విశ్వనాథ్, నటుడు రఘుబాబు, తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశ్, కేపీఆర్ఐటీ విద్యా సంస్థల వైస్ ఛైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శి రాకేశ్‌రెడ్డి ఇంకా అనేకమంది అతిథులతోపాటు నాలుగు వేలకు పైగా విద్యార్థినీ, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాక్సులు బద్దలయ్యే ఇంట్రడక్షన్?



దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ) మెగా ఎంట్రీకి రంగం సిద్ధం చేస్తున్నారు. ఆయన దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. త్వరలోనే దర్శకుడు బాబీ షూట్‌ని మొదలుపెట్టనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు మెగాస్టార్ ఇంట్రడక్షన్ సీన్‌ని తీసేందుకు ఆయన రంగం సిద్ధం చేస్తున్నారట. ఈ ఎంట్రీ సీక్వెన్స్ కోసం ప్రస్తుతం భారీ సెట్స్‌ని నిర్మిస్తున్నారు. ఈ సీక్వెన్స్‌లో మెగాస్టార్‌ని కొత్తగా చూపించేందుకు బాబీ ప్రణాళికలు రచిస్తున్నారు. చిరంజీవితోపాటు మొత్తం నలభై మంది ఫైటర్స్ కూడా ఈ సీక్వెన్స్‌లో కనిపిస్తారట. కుటుంబ భావోద్వేగాలే ప్రధానంగా సాగే ఈ కథలో చిరంజీవి పాత్ర చిత్రణ అభిమానులు పండుగ చేసుకునేలా ఉంటుందని సమాచారం. గతంలో చిరు, బాబీ కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమా అంతకు మించి ఉంటుందని డైరెక్టర్ టీమ్ చెబుతున్నది. సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలనే ఉద్దేశంతో నిర్మాతలు ఉన్నారు.

# మే 15న థియేటర్లలోకి 'రాక్షసపురం' మూవీ




ప్రముఖ నిర్మాణ సంస్థ క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత, సీనియర్ నిర్మాత కేఎస్ రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్న లేటెస్ట్ మూవీ 'రాక్షసపురం'. కన్నడలో సంచలన విజయం సాధించిన 'రాక్షస పుర'చిత్రానికి ఇది తెలుగు అనువాదం. ఈ చిత్రాన్ని మే 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాత కేఎస్ రామారావు అధికారికంగా ప్రకటించారు.విభిన్నమైన నటనతో తనకంటూ ఒకప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజ్ బి శెట్టి ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఇన్ స్పెక్టర్ పాత్రలో నటించారు. డాక్టర్ రవి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఒక ఉత్కంఠభరితమైన మర్డర్ మిస్టరీ థ్రిల్లర్. ఇన్వెస్టిగేషన్ డ్రామా నేపథ్యంలో సాగే కథనం ప్రేక్షకులను అడుగడుగునా థ్రిల్‌కు గురి చేస్తుంది. విడుదల తేదీ మార్పుపై నిర్మాత కేఎస్ రామారావు స్పందిస్తూ..''ఈ సినిమాలోని మేకింగ్ విలువలు, సస్పెన్స్ ఎలిమెంట్స్ నన్ను బాగా ఆకట్టుకున్నాయి. అందుకే ఎలాంటి రాజీ పడకుండా ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించాలని నిర్ణయించుకున్నాం. సినిమాను మే 7న విడుదల చేయాలని ముందుగా అనుకున్నప్పటికీ, మరిన్ని మెరుగైన థియేటర్లు, గరిష్ట స్థాయిలో ప్రేక్షకులకు చేరువయ్యేలా చేసేందుకు వీలుగా మే 15న విడుదల చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా ఈ తేదీ సినిమాకు కలిసి వస్తుందని భావిస్తున్నాం. ఐపీఎల్ అనేది సినిమా ఇండస్ట్రీకి శాపంగా మారింది. భవిష్యత్‌లో ఐపీఎల్ సీజన్‌లో సినిమాలు విడుదల చేసే అవకాశం ఉండదు. ఐపీఎల్ లేని సమయంలోనే సినిమాలు విడుదల చేసేలా నిర్మాతలుప్లాన్ చేసుకోవాలి. ఒకవైపు ఓటీటీ, మరో వైపు ఐపీఎల్ వల్లసినిమా ఇండస్ట్రీకి భారీ నష్టంజరుగుతోంది.'' అని ఆయన తెలిపారు.ప్రస్తుతం ఐపీఎల్ సందడి మరియు ఓటీటీల పోటీ ఉన్నప్పటికీ, కంటెంట్ బలంగా ఉన్న చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారని, 'రాక్షసపురం' కచ్చితంగా ఆ కోవలోకి వస్తుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేసింది. షోల వివరాలు: మే 15న విడుదల కానున్న ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నామని, మార్నింగ్ మరియు మ్యాట్నీ షోలకు ప్రేక్షకుల నుంచి భారీ స్పందన వస్తుందని ఆశిస్తున్నట్లు డిస్ట్రిబ్యూటర్లు పేర్కొన్నారు. ట్రైలర్ అప్‌డేట్: త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్, ఇతర ప్రోమోలను విడుదల చేసి ప్రమోషన్స్ వేగవంతం చేయనున్నారు.

# కృష్ణగారిలాంటి హీరోను నేను చూడలేదు



వెండితెరపై ఆవేశపూరితమైన పాత్రలను చేయడంలో శివకృష్ణకి ఒక ప్రత్యేకత ఉంది. ఉద్యమాలు .. తిరుగుబాట్లకి సంబంధించిన కథలలో ఆయన ఎక్కువగా కనిపిస్తూ వచ్చారు. అలాగే విలేజ్ నేపథ్యంలోని సినిమాలలోనూ ఎక్కువగా నటించారు. హీరో కృష్ణతో కలిసి ఆయన అనేక సినిమాలో నటించారు. తాజాగా 'ఐ డ్రీమ్ టీవీ'వారికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన కృష్ణను గురించి ప్రస్తావించారు. ''కృష్ణగారు మహానుభావుడు .. ఒక నటుడిగా నేను అంటే ఆయనకి ఎంతో అభిమానం. ఫలానా పాత్ర కోసం శివకృష్ణను తీసుకుందామని ఆయన దగ్గర అంటే, వెంటనే ఒప్పేసుకునేవారు. నాకు కాస్త శ్రమ తగ్గుతుందయ్యా .. మనవాడే .. తీసుకోండి అనేవారు. నేను ఎన్టీఆర్ అభిమానినని ఆయనకి కూడా తెలిసే ఉంటుంది. కానీ ఆ విషయాలను ఆయన ఎప్పుడూ ప్రస్తావించేవారు కాదు. ఎన్టీఆర్ తరువాత భోళా మనిషి ఎవరంటే నేను కృష్ణగారి పేరే చెబుతాను'' అని అన్నారు.

# జూన్ 4న వస్తున్న రామ్ చరణ్ పెద్ది...!




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, డైరెక్టర్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ రూరల్ యాక్షన్ డ్రామా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాను ఈ ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురానున్నట్టు శుక్రవారం వెల్లడించారు. ఈ మేరకు రామ్ చరణ్ తన సోషల్ మీడియా ఖాతాలో, ''జూన్ 4న 'పెద్ది'ని కలవండి. థియేటర్లలో కలుసుకుందాం'' అని పోస్ట్ చేశారు. ఈ మేరకు రిలీజ్ పోస్టర్ ను కూడా పంచుకున్నారు. సినిమా షూటింగ్ మొత్తం పూర్తయిన వెంటనే ఈ ప్రకటన రావడం గమనార్హం. మే 1వ తేదీ తెల్లవారుజామున, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు 'పెద్ది' షూటింగ్ పూర్తయినట్టు ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌తో తన ప్రయాణం గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ''రామ్ చరణ్‌తో 'పెద్ది' ఒక మధురమైన ప్రయాణం. ఆయనతో పనిచేయడం చాలా ప్రత్యేకం. తెరపై పవర్‌హౌస్ పెర్ఫార్మర్, తెర వెనుక అద్భుతమైన స్నేహితుడు. మేమిద్దరం కలిసి సృష్టించిన జ్ఞాపకాలకు కృతజ్ఞతలు'' అని రత్నవేలు పేర్కొన్నారు. ప్రతి ఫ్రేమ్‌లో అద్భుతమైన నటనను ప్రదర్శించడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో స్నేహపూర్వకంగా ఉండే వ్యక్తి అని చరణ్‌ను ఆయన కొనియాడారు. ఈ సినిమా కోసం చివరిగా ఒక స్పెషల్ సాంగ్‌ను చిత్రీకరించినట్టు గతంలోనే వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌లో రామ్ చరణ్‌పై ఈ పాటను చిత్రీకరించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ఒక సర్‌ప్రైజ్ ఎలిమెంట్ ఉంటుందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ట్యూన్, డ్యాన్స్, గ్రాండ్ సెట్, అందులోని సర్‌ప్రైజ్‌తో ప్రేక్షకులు థియేటర్లలో ఉర్రూతలూగడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఇది మరో చార్ట్‌బస్టర్ అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు.

వాస్తవానికి ఈ సినిమాను ముందుగా విడుదల చేయాలని భావించినా, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించేందుకే జూన్‌కు వాయిదా వేస్తున్నట్టు వారం క్రితం నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ ప్రకటించింది. ''మా సినిమా పాటలు, గ్లింప్స్‌కు వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. సినిమా టాకీ పార్ట్ పూర్తయింది, కేవలం ఒక పాట మాత్రమే మిగిలి ఉంది. ఎడిట్ చూసుకున్నాం, అవుట్‌పుట్‌తో చాలా సంతోషంగా ఉన్నాం. ఇంత మంచి కంటెంట్‌ను అత్యుత్తమంగా అందించాలనుకు ంటున్నాం. అందుకే మా టెక్నీషియన్లకు, పోస్ట్ ప్రొడక్షన్ బృందానికి కాస్త ఎక్కువ సమయం ఇచ్చి, పూర్తి నాణ్యతతో మీ ముందుకు రావాలని నిర్ణయించుకున్నాం'' అని ఆ ప్రకటనలో వివరించింది. అందుకే సినిమాను జూన్‌కు వాయిదా వేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది.

# క్యూరియాసిటీ పెంచేస్తున్న'ది రెడ్ బ్యాగ్' టీం




విలన్‌గా తెలుగు ప్రేక్షకుల్లో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్నాడు హర్యానా యాక్టర్ కబీర్ దుహన్ సింగ్. ఇప్పటిదాకా సిల్వర్ స్క్రీన్‌పై విలన్‌గా భయపెట్టిన కబీర్ దుహన్ సింగ్ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. ప్రసాద్ బెహరా మరో కీలక పాత్రలో నటించిన ఈ మూవీలో రాధ్య, స్నేహ సింగ్, ఆకాంక్ష ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే ఈ మూవీ ప్రీ లుక్‌ను విడుదల చేశారు. నలుగురు అమ్మాయిల లుక్స్‌తో రిలీజ్ చేసిన ఈ పోస్టర్‌తో బ్యాగ్ చుట్టూ తిరిగే కథాంశంతో యాక్షన్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ఈ చిత్రం డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతుందంటూ హింట్ ఇచ్చారు మేకర్స్. ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ చేసిన మరో పోస్టర్‌లో చేతినిండా రక్తం, ఆ బ్యాగును పట్టుకున్న తీరు, అక్కడే ఉన్న కత్తులు, తుపాకులు, రక్తపుమయంగా మారిన ఏరియా ఇలా ప్రతీ ఒక్కటి ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. ఇటీవల సినిమాలో వచ్చే కీలక సన్నివేశాలను థాయ్‌లాండ్‌లో షూట్ చేసింది టీం. థాయ్‌లాండ్‌లో వచ్చే సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలువబోతున్నాయట. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రం టీజర్‌ను త్వరలోనే విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు

మేకర్స్. నిర్మాత హరికృష్ణ సోమిశెట్టికి డెబ్యూ సినిమానే అయినా భారీ బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. ఇంతకీ ది రెడ్ బ్యాగులో ఏముంది.. కబీర్ దుహన్ సింగ్ పాత్ర ఎలా ఉండబోతుందనేది మాత్రం సస్పెన్స్‌లో పెట్టేశారు మేకర్స్.

ఈ మూవీకి రవికుమార్ సీరపు కథ, కథనం అందించడమే కాకుండా దర్శకత్వం కూడా వహిస్తున్నాడు. ది రెడ్ బ్యాగ్‌లో ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# వారణాసి కోసం విదేశాల్లో మహేష్ బాబు ట్రైనింగ్..

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం దర్శక దిగ్గజం రాజమౌళి తెరకెక్కిస్తున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'తో బిజీగా ఉన్నారు. గ్లోబల్ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మహేష్ బాబు తాజాగా విదేశాలకు వెళ్లడం చర్చనీయాంశంగా మారగా, ఆయన తాజా పోస్టుతో అసలు విషయంపై క్లారిటీ వచ్చింది. ఇటీవల షూటింగ్‌కు చిన్న బ్రేక్ ఇచ్చిన మహేష్ బాబు ఎక్కడికి వెళ్లారన్నది ఆసక్తికరంగా మారింది. సినిమా తదుపరి షెడ్యూల్ కోసం ముందస్తు ఏర్పాట్లలో భాగంగా వెళ్లి ఉంటారని భావించినప్పటికీ, ఆయన స్వయంగా తన లొకేషన్‌ను సోషల్ మీడియాలో వెల్లడించారు. ప్రస్తుతం జర్మనీలోని బ్లాక్ ఫారెస్ట్ ప్రాంతంలో ఉన్నట్లు తెలిపారు.అక్కడ ట్రెక్కింగ్ చేస్తూ, ఫిట్‌నెస్ ట్రైనింగ్ తీసుకుంటూ సినిమా కోసం తనను తాను సిద్ధం చేసుకుంటున్నట్లు మహేష్ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రముఖ ట్రైనర్ హ్యారీతో కలిసి దిగిన ఫోటోలను కూడా పంచుకున్నారు. ఇవి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బ్లాక్ ఫారెస్ట్ జర్మనీలోని అత్యంత ప్రసిద్ధి చెందిన అటవీ ప్రాంతాలలో ఒకటి. జర్మనీ లోని బాడెన్-వుర్టెంబర్గ్ రాష్ట్రంలో ఉన్న ఈ ప్రాంతం ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ సరిహద్దులకు సమీపంలో ఉంటుంది. ప్రకృతి సౌందర్యం, కొండలు, లోయలు, సరస్సులు, వన్యప్రాణులతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఇదే ప్రాంతానికి మహేష్ బాబు గతంలో కూడా వెళ్లారు. 2024లో 'గుంటూరు కారం' సినిమా విడుదల అనంతరం కూడా ఆయన ఇక్కడ ట్రెక్కింగ్ చేస్తూ కనిపించారు. ఇప్పుడు మళ్లీ అదే ప్రాంతంలో ట్రైనింగ్ తీసుకోవడం గమనార్హం. 'వారణాసి' సినిమా ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ అడ్వెంచర్ కథతో రూపొందుతున్నట్లు సమాచారం. తదుపరి షెడ్యూల్ షూటింగ్ అంటార్కిటికాలో జరుగుతుందని వార్తలు వస్తుండగా, అందుకోసమే మహేష్ ముందస్తుగా ఫిట్‌నెస్ ట్రైనింగ్ తీసుకుంటున్నారని భావిస్తున్నారు. ఇక ఈ సినిమాను అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్నారు. నిర్మాత ఎస్ఎస్ కార్తికేయ ఇటీవల ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని స్పానిష్ భాషలో కూడా విడుదల చేయనున్నారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209.“
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411